
సాక్షి
అనంతపురం

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024

I



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. సరాసరి రూ.15 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.2°/17.9°

జిల్లాలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి. ఉదయం కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం నెలకొంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష

• నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

అనంతపురం అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం జరగనుంది. జిల్లావ్యాప్తంగా 111 కేంద్రాల్లో 32,391 మంది హాజరుకానున్నారు. పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. నిర్దేశిత సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను కేంద్రం లోకి అనుమతించమని ఆమె స్పష్టం చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల మధ్యన కేంద్రానికి చేరుకోవాలన్నారు.గ్రేస్ పీరియడ్‌తో కలిసి ఉదయం 10.15 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదేని గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్, పాస్‌పోర్ట్, తదితర) తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోని అనుమతించమన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏదేని సమస్య లేదా ఫిర్యాదు ఉన్నా 08554-220009 ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

అభ్యర్థులకు ఎస్పీ శుభాకాంక్షలు

అనంతపురం: గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఎస్పీ అన్బురాజన్ శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలో అర్హత సాధించి మెయిన్స్ రాయాలని ఆకాంక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏవేని ఇబ్బందులు కలిగితే అభ్యర్థులు డయల్-100కు లేదా తన ఫోన్ నంబర్ 9440796800 నంబర్‌కు సమాచారం చేరవేయాలని సూచించారు.

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో రబీలో రైతులు పండించిన పప్పుశనగ కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీకే వేదికగా క్వింటా రూ.5,440 ప్రకారం నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసి 3 వారాల్లోపు చెల్లింపులు చేస్తారన్నారు. రైతులు ఆర్‌బీకే అసిస్టెంట్లను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

సీటు పోటు.. మండిపాటు

• టీడీపీ తొలి జాబితాపై శ్రేణుల భగ్గు
• కళ్యాణదుర్గం, శింగనమల, పెనుకొండ, మడకశిరలో నిరసనాగ్రహం
• అనంతపురంలో పార్టీ కార్యాలయ కిటికీలు, ఫర్నీచర్ ధ్వంసం
• చంద్రబాబు, లోకేష్ ఫ్లెక్సీల చించివేత
• డబ్బుకు అమ్ముడుబోయారంటూ ధ్వజం

సాక్షి ప్రతినిధి, అనంతపురం/కళ్యాణదుర్గం/శింగనమల/అనంతపురం ఎడ్యుకేషన్: తెలుగు దేశం పార్టీ ప్రకటించిన అభ్యర్థుల జాబితా ఆ పార్టీలో చిచ్చు రేపింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. తమ నేతకు సీటు ఇవ్వకపోవడంతో తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు చించివేశారు. రోడ్లపైనే దహనం చేశారు. చంద్రబాబు ఏకపక్ష నిర్ణయంపై మండిపడ్డారు. డబ్బుకు అమ్ముడుపోయారటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యాలయ కిటికీలు, ఫర్నీచర్ ధ్వంసం

గత ఎన్నికల్లో టీడీపీ తరఫున శింగనమల నియోజకవర్గ బరిలో నిలిచి ఓడిపోయిన బండారు శ్రావణికే మళ్లీ టికెట్ ప్రకటించడంపై ఆ పార్టీ శింగనమల టూమెన్ కమిటీ సభ్యులు ముంటి మడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు వర్గీయులు రెచ్చిపోయారు. అనంతపురంలోని టీడీపీ కార్యాలయంపై శనివారం సాయంత్రం దాడి చేశారు. కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. కార్యాలయ ఆవరణలో కట్టిన ఫ్లెక్సీలను చించేశారు. చంద్రబాబు డౌన్ డౌన్... నారా లోకేష్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నియోజకవర్గంలో టీడీపీని బండారు శ్రావణి నాశనం చేసిందన్నారు. 90 శాతం పార్టీ కేడర్ ఆమెను వ్యతిరేకిస్తోందన్నారు. అలాంటి వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బండారు శ్రావణిని గెలవనివ్వమని స్పష్టం చేశారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా అభ్యర్థిని బరిలో దింపుతామన్నారు. అధిష్టానానికి తమ సత్తా ఏంటో చూపుతామన్నారు. బండారు శ్రావణిని మార్చకుంటే పార్టీని వీడతామని హెచ్చరిస్తూ ఆమె వ్యతిరేక వర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు చంద్రబాబుకు లేఖ రాశారు.

మా చెప్పుతో మేం కొట్టుకోవాలి..

కళ్యాణదుర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి బహిరంగంగా తన అసమ్మతి తెలియజేశారు. ఎస్‌ఆర్‌సీ నిర్మాణ సంస్థ అధినేత సురేంద్రకు టికెట్ ఇచ్చారనే వార్త తెలుసుకున్న వెంటనే తన ఇంటివద్ద ఉన్న ఫ్లెక్సీలు, జెండాలు తీసేశారు. కనీసం తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జెండాలను చెత్తలో పడేశారు. సీనియర్‌ను విస్మరించి అభ్యర్థి ఎంపికపై ఎలా నిర్ణయం తీసుకుంటారంటూ ఆయన కుమారుడు మారుతీ చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముక్కూ, మొహం తెలియని వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారంటూ చంద్రబాబును నిలదీశారు. ఈ క్రమంలోనే ఆయనకు పలువురు నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. కాంట్రాక్టర్ ఇచ్చే డబ్బుకు అమ్ముడు పోయారని తెలుగు తమ్ముళ్లు చంద్రబాబును తీవ్ర పదజాలంతో దూషించారు. తెలుగుదేశం పార్టీ పేదల పార్టీ కాదు, డబ్బున్న వారి పార్టీ అంటూ నినాదాలు చేశారు. పార్టీలో కష్టపడి జెండాలు మోసినందుకు తమ చెప్పులతో తాము కొట్టుకోవాలంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



పెనుకొండలో బీకే పార్థసారథి ఇంటి వద్ద టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు దహనం చేస్తున్న నాయకులు

రోడ్డుపై టీడీపీ ఫ్లెక్సీలు, జెండాల దహనం

సవితమ్మకు పెనుకొండ టికెట్ కేటాయించడంపై శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథి అనుచరులు నిరసన తెలిపారు. బీకే ఇంటి సమీపంలో రోడ్డుపై తెలుగుదేశం జెండాలు, ఫ్లెక్సీలకు నిప్పు పెట్టారు. లోకేష్, చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

తలుపులు మూసి.. చెప్పులు విసిరి

మడకశిర టీడీపీ అసెంబ్లీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు డాక్టర్ సునీల్‌కుమార్‌కు కేటాయించడంపై నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వర్గం మండిపడింది. టికెట్ ప్రకటించగానే మాజీ ఎమ్మెల్యే ఈరన్న, తనయుడు సునీల్‌కుమార్‌లు గుండుమల తిప్పేస్వామి మద్దతు కోరడానికి ఆయన ఇంటికి వెళ్లారు. అప్పటికే అక్కడ గుమిగూడిన గుండుమల అనుచరులు వారిని ఇంట్లోకి రాకుండా అడ్డుకున్నారు. తలుపులు మూసేసి..ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని దూషిస్తూ చెప్పులు విసిరారు.

ఆందోళన బాటలో మరికొందరు..

చంద్రబాబు ఇప్పటివరకూ కేవలం 9 సీట్లు ప్రకటించారు. మిగతా 5 సీట్లు ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సీనియర్లు ఆందోళనలో ఉన్నారు. పల్లె రఘునాథరెడ్డి, ప్రభాకర్ చౌదరి, జితేందర్‌గౌడ్‌లకు టికెట్లు రావడం అనుమానంగా ఉంది. మిగతా సీట్లు వెల్లడిస్తే అసంతృప్తి జ్వాలలు మరింతగా ఎగిసిపడే అవకాశం ఉంది.





అనంతపురం పార్టీ కార్యాలయం, కళ్యాణదుర్గంలో టీడీపీ నేత ఉన్నం ఇంటి వద్ద ఫ్లెక్సీలు చించేసిన దృశ్యం

రగిలిపోతున్న నేతలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలుండగా అనంతపురం పార్లమెంటు పరిధిలో 5, హిందూపురం పార్లమెంటు పరిధిలో 4 స్థానాల్లో అభ్యర్థుల పేర్లను చంద్రబాబు ప్రకటించారు. జాబితాలో పార్టీలో కీలక నేతల పేర్లు లేవు. రెండు దశాబ్దాలుగా టీడీపీలో ఉన్న పల్లెరఘునాథరెడ్డి, కందికుంట ప్రసాద్, ప్రభాకర్ చౌదరి కానరాలేదు. దీంతో వారంతా తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. నిన్న గాక మొన్న పార్టీలోకి వచ్చిన జేసీ అస్మిత్‌రెడ్డి పేరును తాడిపత్రి అభ్యర్థిగా ప్రకటించిన బాబు.. అత్యంత సీనియర్ అయిన తనను విస్మరించారంటూ పల్లె రఘునాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కందికుంట ప్రసాద్ కూడా తన అనుచరులతో అసంతృప్తి వెళ్లగక్కినట్లు సమాచారం. ఇక.. అనంతపురం అర్బన్ సీటు జనసేనకు ఇచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతుండడం, ఈ క్రమంలోనే ప్రకటించిన జాబితాలో తన పేరు లేకపోవడంతో వైకుంఠం ప్రభాకర్ చౌదరి లోలోనే రగిలిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో టీడీపీ సీనియర్ నేతగా పేరుపొందిన బీకే పార్థసారథికి కూడా మొండి చేయి చూపడంతో అధినేత వైఖరిపై ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎస్‌ఆర్‌సీ నిర్మాణ సంస్థ అధినేత అమిలినేని సురేంద్రబాబుకు సీటు కేటాయించడంతో ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఉమా మహేశ్వరనాయుడులో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

28న 'వైఎస్సార్ రైతు భరోసా' విడుదల

• పంట రుణాల సున్నావడ్డీ కూడా జమ

అనంతపురం అగ్రికల్చర్: 'వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్' పథకంలో భాగంగా వరుసగా ఐదో ఏడాది పెట్టుబడి సాయాన్ని ఈనెల 28న ప్రభుత్వం విడుదల చేయనుంది. రూ.2 వేల ప్రకారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దీంతో పాటు వైఎస్సార్ పంట రుణాల సున్నావడ్డీ కింద 2022 ఖరీఫ్, రబీలో రూ. లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2 పథకాల కింద రైతులకు పెద్ద మొత్తంలో ప్రయోజనం చేకూరనుందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద అనంతపురం జిల్లాలో 2.94 లక్షల మంది రైతులకు రూ.58.80 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 2.80 లక్షల మంది రైతులకు రూ.56 కోట్లకు పైగా నగదు జమ అయ్యే అవకాశం ఉందన్నారు. గత జూన్‌లో ఖరీఫ్ కింద ఒక్కో రైతుకు రూ.7,500, అక్టోబర్‌లో రబీకి రూ.4 వేల ప్రకారం జమ చేయగా... తాజాగా తుది విడతగా రూ.2 వేల ప్రకారం ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తంగా ఏటా రూ.13,500 ప్రకారం పెట్టుబడి సాయం అందనుంది. ఇందులో కేంద్రం వాటా రూ.6 వేలు కాగా, మిగిలిన రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. కేంద్రంతో పనిలేకుండా కౌలు రైతులు, ఆటవీ, దేవాదాయ భూమి సాగుదారులకు పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు విడుదల చేస్తోంది. అలాగే పంట రుణాల వడ్డీ మాఫీ చేస్తోంది.

ఎపిక్ కార్డుల చేరవేతకు శ్రీకారం

అనంతపురం అర్బన్: ఎపిక్ కార్డులను ఓటర్లకు చేరవేసే ప్రక్రియకు జిల్లా ఎన్నికల యంత్రాంగం శ్రీకారం చుట్టింది. కొత్త ఓటరుగా నమోదైన వారికి, ఓటరు జాబితాలో వివరాల మార్పు, చేర్పు చేసుకున్న ఓటర్లకు ఎపిక్ కార్డులు జిల్లాకు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా 2.30 లక్షల మందికి కొత్తగా కార్డులు మంజూరుకాగా, ఇప్పటి వరకూ 1.08 లక్షల ఎపిక్‌కార్డులు జిల్లాకు చేరాయి. వీటిని పోస్టల్ ద్వారా పంపించే ప్రక్రియను కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బంది ప్రారంభించారు.

వైభవం.. కొండమీదరాయుని రథోత్సవం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో శనివారం కొండమీద రాయుని రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల గోవిందనామ స్మరణతో పురవీధులు మార్మోగాయి. రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులతో బుక్కరాయసముద్రం కిటకిటలాడింది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకర్ నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం

రథోత్సవానికి ముందు స్థానిక లక్ష్మినారాయణ స్వామి ఆలయంలో అర్చకులు శనివారం తెల్లవారుజాము 4 గంటలకు కొండమీదరాయునికి, శ్రీదేవి, భూదేవికి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. 11.30 గంటలకు ఉత్సవమూర్తులకు సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. హోమాలు, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 12.10 గంటలకు రథోత్సవాన్ని ప్రారంభించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి పాత పంచాయతీ కార్యాలయం వరకూ, సాయంత్రం అక్కడి నుంచి బ్రాహ్మణ వీధి మీదుగా వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వరకూ తేరు లాగారు.

పులకించిన భక్త జనం..

రథోత్సవం సందర్భంగా గోవిందనామ స్మరణతో బుక్కరాయసముద్రం మార్మోగింది. స్వామిని చూసి భక్తులు తన్మయత్వం పొందారు. భక్తిశ్రద్ధలతో రథం లాగుతూ ఆధ్యాత్మిక సాగరంలో మునిగి పోయారు. కొండమీదరాయుని రథోత్సవం తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుర వీధుల్లో రథాన్ని లాగిన తరువాత గుమ్మడికాయలు, టెంకాయలు రథం వద్ద సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గోవిందనామ స్మరణ చేసుకుంటూ దేవర కొండపైకి చేరుకున్నారు. కొండపై వెలసిన వెంకటరమణస్వామికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారీ బందోబస్తు..

కొండమీద రాయుని రథోత్సవానికి డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు కల్పించారు. తిరునాలకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీదారు, దాతలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, తదితరులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



అశేష భక్తజనం నడుమ సాగుతున్న కొండమీదరాయుని రథోత్సవం, (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

క్లెయిములు పక్కాగా పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: ఓటరు జాబితాకు సంబంధించి అందిన క్లెయిములను ఫ్రారం6, 7, 8) పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఓటు తొలగింపునకు సంబంధించిన క్లెయిములు పరిశీలన చేసి ఆదివారం సాయంత్రంలోపు తనకు పంపించాలని చెప్పారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈఆర్‌ఓలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రధానంగా ఓటు తొలగింపునకు సంబంధించి ఫారం-7 దరఖాస్తులు అధికమయ్యాయన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి, సూక్ష్మ పరిశీలన చేయాలని ఆదేశించారు. ఫారం-7 క్లెయిములు 18,288 తనకు రావాల్సి ఉండగా 9 వేలు వచ్చాయన్నారు. మిగిలిన వాటిని పరిశీలించి ఆదివారంలోపు పంపించాలన్నారు. వాటిని జిల్లాస్థాయిలో పరిశీలించి అనుమతి కోసం రాష్ట్ర ప్రధాన ఎన్నిక అధికారికి పంపిస్తామన్నారు. సీఈఓకు పంపిన 4,405 క్లెయిములు సర్టిఫికేషన్ పరిశీలన పూర్తి చేసుకుని అనుమతి పొంది వచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు.

సమస్యాత్మక గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: సమస్యాత్మక గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆత్మకూరు పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిసెప్షన్ సెంటర్, లాకప్ గదులను పరిశీలించారు. పోలీసుస్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాల్లోని తాజా పరిస్థితులపై ఆరా తీశారు. గ్రామాల్లో సమస్యలకు కారణమయ్యే వారిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను వెంటనే డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, గంజాయి, నాటు సారా తయారీ, అమ్మకం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మునీర్ అహమ్మద్, ఏఎస్‌ఐ దస్తగిరి, జమేదార్ బాబు నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

టీడీపీ, జనసేన పొత్తు అట్టర్‌ఫ్లాప్ ఖాయం

• వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం కార్పొరేషన్: టీడీపీ, జనసేన పార్టీల పొత్తు అట్టర్ ఫ్లాప్ కావడం ఖాయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య స్పష్టం చేశారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం టీడీపీ అధినేత చంద్రబాబును సీఎం చేయడానికి పొత్తు రాజకీయానికి తెరలేపారన్నారు. తన అభిమానులు, కాపుల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు పాదాల వద్ద తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. ఈ రెండు పార్టీల పొత్తుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చే నష్టమేమీ లేదన్నారు. ప్రజా ప్రభుత్వం వైపే ప్రజలు మొగ్గు చూపుతారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంను చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన పార్టీలు బంగాళాఖాతంలో కలిసిపోతాయన్నారు.

క్లుప్తంగా

కల్లూరులో పట్టపగలే చోరీ


కల్లూరులో చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీం సభ్యులు

గార్లదిన్నె: కల్లూరులో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం ఉదయం చంద్రశేఖర్‌రెడ్డి భార్య ఇంటికి తాళం వేసి.. వెనుకనే ఉన్న తోటలో కూలీలతో పని చేయించేందుకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం పగల గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తీసి అందులో ఉన్న 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతపురం నుంచి క్లూస్ టీం, జాగిలాలు రప్పించి ఆధారాలు సేకరించి, దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

ట్రాక్టర్ డోర్ తగిలి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు యగ్నేష్

యాడికి: ట్రాక్టర్ డోర్ తగిలి బాలుడు మృతి చెందాడు. ఈ హృదయ విదారక ఘటన చందన గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చందన గ్రామానికి చెందిన రాజశేఖర్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు యగ్నేష్ (8) రాయలచెరువులోని ప్రైవేటు స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. గుత్తి మండలం తొండపాడు జరిగే జాతరకు కుటుంబ సభ్యులతో వెళ్లాలనుకున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ట్రాక్టర్ సిద్ధం చేసుకున్నాడు. ఇంటి ముందర నుంచి ట్రాక్టర్‌ను ముందుకు కదిలించే సమయంలో అకస్మాత్తుగా ట్రాలీ డోర్ ఓపెన్ అయ్యి అక్కడే ఉన్న కుమారుడు యగ్నేష్‌కు బలంగా తగిలింది. చెవిలోంచి రక్తం రావడంతో వెంటనే రాయలచెరువులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే యగ్నేష్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మూడు నెలల క్రితం భార్య అనూష అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకోవడం.. ఆ షాక్ నుంచి తేరుకోక ముందే పెద్ద కుమారుడు ప్రమాదవశాత్తూ చనిపోవడంతో రాజశేఖర్ కన్నీరు మున్నీరయ్యాడు. యగ్నేష్ మృతదేహంపై పడి అవ్వాతాతలు రోదించడం చూపరులను కలచి వేసింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

- మార్చి 1 నుంచి 20 వరకు పరీక్షలు
- జిల్లాలో 58 కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 41,556 మంది విద్యార్థులు
- స్ట్రాంగ్ రూంలో ప్రశ్నపత్రాలు భద్రం




ప్రశ్నపత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూం వద్ద పోలీసు బందోబస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందడి ప్రారంభమైంది. ఈ నెల 11 నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు 20వ తేదీ నాటికి ముగిశాయి. మార్చి 1 నుంచి 20 వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. నిఘా నీడలో పరీక్షలు నిర్వహించేందుకు బోర్డు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 41,556 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 24,446 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,110 మంది ఉన్నారు.

- జిల్లాలో మొత్తం 58 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. పరీక్షల నిర్వహణపై ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎస్.వెంకటరమణ నాయక్, జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) సభ్యులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా పరీక్ష కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఆయా కేంద్రాల్లోని మౌలిక వసతుల గురించి ఆరా తీస్తున్నారు. ప్రతి కేంద్రంలోనూ ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నీచరు, తాగునీరు, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.
- అనంతపురానికి రెండ్రోజుల కిందట వచ్చిన ప్రశ్నపత్రాలను కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. ఆర్మ్‌డ్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 26వ తేదీ నుంచి స్టోరేజ్ పాయింట్లు (పోలీస్‌స్టేషన్ల)కు తరలించనున్నారు. 58 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 58 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. రెగ్యులర్ అధ్యాపకులు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లను నియమించారు. దాదాపు 870 మంది ప్రభుత్వ టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించానున్నారు.

వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్..

విద్యార్థులు హాల్‌టికెట్ల కోసం ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా https://bieap.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచారు. వెబ్‌సైట్ ద్వారా నేరుగా విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదు. హాల్‌టికెట్ తీసుకుని నేరుగా పరీక్ష కేంద్రాలకు వెళ్లొచ్చు.

ఏ చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు

ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఏ చిన్న పొరపాటుకూ తావివ్వొద్దని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎస్.వెంకటరమణనాయక్ సూచించారు. ఈ నెల 1నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల నిర్వహణపై శనివారం కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ పరీక్షల విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించొద్దని ఆదేశించారు. ప్రతి కేంద్రం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎవరూ సెల్‌ఫోన్లు వినియోగించరాదన్నారు. అనుమతి ఉండదన్నారు. సీఎస్, డీఓలు, ఇతర సిబ్బంది తమ సెల్‌ఫోన్లను సీఎస్‌ల వద్ద డిపాజిట్ చేయాలన్నారు. బోర్డు నుంచి ప్రతి సెంటర్‌కూ కీ ప్యాడ్ ఫోన్లు పంపుతారన్నారు. వాటి ద్వారా సీఎస్‌లు సమాచారం పంపాల్సి ఉంటుందన్నారు. అలాకాకుండా మనం వాడే ఇతర ఫోన్లు ఎక్కడైనా కనిపిస్తే సంబంధిత సీఎస్‌లదే బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో డీఈసీ సభ్యులు శంకరయ్య, షఫి, జగన్నాథ్, జిల్లా బల్క్ ఇన్‌చార్జ్ సుభద్ర, ఒకేషనల్ డీఈసీ సభ్యులు వెంకటేశ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి


మాట్లాడుతున్న మోడల్ స్కూళ్ల జేడీ వెంకటకృష్ణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాయనున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని ఏపీ మోడల్ స్కూళ్ల జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని మోడల్ స్కూళ్లలో పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతపై ప్రిన్సిపాళ్లు, సబ్జెక్టు టీచర్లతో అనంతపురంలోని పంగల్‌రోడ్డు ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులూ ముఖ్యంగా గణితం, సైన్స్‌లో విద్యార్థుల వెనుకబాటుతనాన్ని గుర్తించారు. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా అధ్యయన తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల పురోగతిని అంచనా వేయడానికి ప్రిన్సిపాల్స్ /ఉపాధ్యాయులు రెగ్యులర్ ప్రాతిపదికన స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. అదే రోజున మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు. పరీక్షలలో 100 శాతం ఫలితాలు సాధించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో డీఈఓ వరలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, రాష్ట్ర కార్యాలయ సీబీఎస్‌ఈ కోఆర్డినేటర్ శ్రీలత, ఏఎంఓ, అసిస్టెంట్ ఏఎంఓలు ధర్మకుమార్, శరత్, శ్రీసత్యసాయి జిల్లా ఏడీ రామకృష్ణ, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ సత్యసాయి' కలెక్టర్‌కే ఆ 3 మండలాల ఎన్నికల బాధ్యత

అనంతపురం అర్బన్: రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఎన్నికల నిర్వహణ బాధ్యత శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఆ 3 మండలాలు ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ఎన్నికల నిర్వహణ బాధ్యతలు మాత్రం పూర్వపు జిల్లా ఉన్నతాధికారులే చూసేవారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా తాజాగా కొత్త జిల్లా కలెక్టర్‌కే ఆ 3 మండలాల ఎన్నికల బాధ్యతలు అప్పగించారు. దీంతో అనంతపురం జిల్లాలోని పోలింగ్‌కేంద్రాల సంఖ్య తగ్గింది. ఇప్పటివరకూ 8 నియోజకవర్గాల పరిధిలో 2,213 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తాజాగా 3 మండలాల్లోని 111 పోలింగ్ కేంద్రాలు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి వెళ్లడంతో 2,102కి తగ్గింది.

ఆర్‌బీకే అసిస్టెంట్ల బదిలీకి గ్రీన్ సిగ్నల్

అనంతపురం అగ్రికల్చర్: సచివాలయ వ్యవస్థలో భాగంగా ఆర్బీకేలో నియమితులైన వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ విలేజ్ అసిస్టెంట్ల బదిలీకి ఉత్తర్వులు వచ్చినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా అంతర్ జిల్లాల పరిధిలో బదిలీలు ఉంటాయని పేర్కొన్నాయి. ఈ నెల 29లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి

పుట్లూరు: ఎల్లుట్ల గ్రామంలో లక్ష్మీనారాయణ (43) అనే వ్యక్తి శనివారం ఇంటి మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. లక్ష్మీనారాయణ అక్క లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హేమాద్రి కేసు నమోదు చేశారు.

రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

- డివిజన్‌లో 15 'అమృత్ భారత్' స్టేషన్లకు నేడు శంకుస్థాపన
- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ


గుత్తి నూతన రైల్వే స్టేషన్

గుంతకల్లు: రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) వినీత్‌సింగ్ పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా 15 రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు దాదాపు 24 రోడ్ అండర్ బ్రిడ్జీలను ఆదివారం ప్రారంభించి జాతికి అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సీనియర్ డీసీఎం మనోజ్, డీసీఎం జీ.సోమశేఖర్‌నాయుడుతో కలిసి శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు వేగవంతమైన ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ స్టేషన్లలో లిఫ్టులు, విశాలమైన వెయిటింగ్ హాల్స్, కొత్త ప్లాట్‌ఫామ్‌లు, పార్కింగ్ ప్లేస్‌లు తదితర అభివృద్ధి పనులతోపాటు స్టేషన్ భవనం ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని ఆదోని, అనంతపురం, ధర్మవరం, డోన్, చిత్తూరు, పాకాల, రాజంపేట, కడప, తాడిపత్రి, మదనపల్లి, శ్రీకాళహస్తి, మంత్రాలయం, గుత్తి, రాయచూర్, యాదగిరి రైల్వేస్టేషన్లను ఈ పథకం కింద ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారి ప్రయాణికులకు కొత్త అనుభూతి కల్గిస్తాయని పేర్కొన్నారు. అదే విధంగా అన్నమయ్య, కడప, అనంతపురం, కర్నూలు, తిరుపతి, చిత్తూరు, తెలంగాణలోని నారయణపేటలో దాదపు 24 రోడ్డు ఓవర్ బ్రిడ్జీలు, రోడ్డు అండర్ బ్రిడ్జీల నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు. ఆదివారం ప్రధాని మోదీ వీడియో లింక్ ద్వారా వీటిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైలు ప్రయాణికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్ స్కూల్

అనంతపురం క్రైం: అనంతపురం ఆర్టీసీ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 29వ తేదీన కొత్త బ్యాచ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 16 మందికి అవకాశం ఉంటుందని ఆయన వెల్లడించారు. శిక్షణ పొందాలనుకునేవారు 99592 25853, 79898 00870 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'ఉపాధి' పనుల కల్పనకు చర్యలు


కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లాలో ఉపాధి పనులు విస్తృతంగా కల్పించేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ గౌతమి తెలిపారు. సీఎస్ శనివారం విజయవాడ నుంచి గ్రూప్–2 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు, రెవెన్యూ, రీ–సర్వే, ఉపాధి పనులు, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలపై సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున పనులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. క్షేత్రస్థాయిలో వంద రోజుల లక్ష్యానికి అనుగుణంగా కుటుంబాలకు పనులు కల్పించడంపై దృష్టి పెట్టామన్నారు. ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించాలని అధికారులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. జిల్లాలో ఉరవకొండ, వజ్రకరూరు, కణేకల్లు, బెళుగుప్ప, తదితర మండలాల పరిధిలో తక్కువ మంది కూలీలకు పనులు కల్పించినట్లు గుర్తించామని, ఈ ప్రాంతాల్లో ఎక్కువ మందికి పనులు కల్పించేలా చర్యలు చేపట్టామన్నారు. గ్రూపు–2 పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్, రీసర్వే, ఇళ్ల నిర్మాణం పనుల వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ ఎహసాన్‌బాషా, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తలారి చెరువు ఊరు ఖాళీ

- కొనసాగిన 'అగ్గిపాడు' ఆచారం



దర్గా వద్ద వంటావార్పు

తాడిపత్రి: మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం తలారిచెరువు గ్రామస్తులు 'అగ్గిపాడు' ఆచారం పాటించారు. సూర్యోదయానికి ముందే ప్రజలందరూ ఇళ్లకు తాళాలు వేసి.. పశువులను వెంటబెట్టుకుని సమీపంలోని హాజీవలి దర్గాకు చేరుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఊరంతా నిర్మానుష్యంగా మారిపోయింది. దర్గా వద్దే వంటా వార్పు చేసుకుని రాత్రి వరకు గడిపారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తిరిగి వారు ఊరిలోకి ప్రవేశించారు. ఇళ్లు శుభ్రం చేసుకుని, కల్లాపి చల్లి, టెంకాయ కొట్టి, దీపం వెలిగించి, అన్నపాదులు స్వీకరించి దైనందిన కార్యక్రమాలు కొనసాగించారు.

అగ్గిపాడు ఆచారం ఎందుకంటే...

తలారిచెరువులో 400 ఏళ్ల క్రితం దొంగతనానికి వచ్చిన బ్రాహ్మణుడిని గ్రామస్తులు కొట్టి చంపారు. ఈ ఘటన తర్వాత గ్రామంలో ఎవరికీ సంతానభాగ్యం కలగలేదు. అప్పుడు గ్రామస్తులు ఓ పండితుని వద్ద సమస్యను మొరపెట్టుకోగా.. బ్రాహ్మణ హత్య మహాపాతకమని, దాని నుంచి బయటపడేందుకు మాఘమాస పౌర్ణమి రోజు ఊరు ఖాళీ చేసి.. బయట ప్రదేశంలో ఒకరోజు గడపాలని సూచించారట. దీంతో వారు అప్పటి నుండి సమీపంలో ఉన్న దర్గాకు మాఘ పౌర్ణమి వేళ గ్రామాన్ని ఖాళీ చేసి, కుటుంబ సమేతంగా అక్కడికి వెళ్లి అక్కడనే ఆ రోజంతా గడిపి మరుసటి రోజున గ్రామానికి తిరిగి రావాలని చెప్పారట. ఇలా చేయడం వల్ల గ్రామస్తుల కష్టాలన్నీ పోతాయనేది నమ్మకం.

అగ్రగామిగా జేఎన్‌టీయూ


సమావేశంలో మాట్లాడుతున్న న్యాక్ పీర్ కమిటీ సభ్యులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం అగ్రగామిగా రూపుదిద్దుకుందని న్యాక్ పీర్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. న్యాక్ పీర్ కమిటీ మూడు రోజుల పర్యటన అనంతరం యూనివర్సిటీ ఉన్నతాధికారులతో శనివారంఎగ్జిట్ సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలపై సమీక్ష చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఎస్ శ్రీనివాసరావు ప్రజెంటేషన్ ఇచ్చారు. తొలి రోజు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, జేఎన్‌టీయూఏ వీసీ శ్రీనివాసరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ సమావేశమయ్యారు. రెండో రోజు న్యాక్ పీర్ కమిటీ మూడు బృందాలుగా విడిపోయి వర్సిటీలోని అన్ని విభాగాలను సందర్శించారు. చివరి రోజైన శనివారం డైరెక్టర్లు, బోధన, బోధనేతర, విద్యార్థులతో న్యాక్ పీర్ కమిటీ పలు సలహాలు, సూచనలు చేశారు. ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రంగనాథుడి రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో బొలికొండ రంగనాథుడు


వైభవంగా సాగుతున్న రంగనాథుడి రథోత్సవం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం అట్టహాసంగా సాగింది. రంగనాథస్వామి నామస్మరణతో పరిసర ప్రాంతాలు ప్రతిధ్వనించాయి. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథం(తేరు)లో కొలువుదీర్చారు. అర్చకులు పలుకూరి రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్‌వర్మ, నవీన్‌కుమార్, ఉదయ్‌కుమార్ వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ దేవదాసు, తహసీల్దార్ భారతి, మాణిక్య రంగనాథ స్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, ఉత్సవ ప్రత్యేక అధికారి పాండురంగారెడ్డి టెంకాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాదిమంది భక్తులు స్వామి నామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- శనివారం వేకువజామున 3 గంటలకు రంగనాథస్వామి ఆలయంలో స్వామివారికి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణ కట్టపై శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడికి అర్చకులు కల్యాణం జరిపించగా భక్తులు అక్షింతలు సమర్పించి ఆశీస్సులు పొందారు.
- రథోత్సవం సందర్భంగా బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్, దేవేంద్రనాయక్ సిబ్బంది ఆంజనేయులు, జఫ్రుల్లా, వలి తదితరులతో వైద్య శిబిరం నిర్వహించారు.
- బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఈఓ దేవదాసు, అర్చకులు పూర్ణ కుంభం, ఆలయ సంప్రదాయం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, పురుషోత్తం, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, క్రషర్ మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు వరదరాజులు, నరేష్, ఫరూక్, మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు జీవీ.రామన్, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్, సురేష్ పాల్గొన్నారు.
- రథోత్సవాన్ని పురస్కరించుకుని రైతులు గుడి చుట్టూ తిప్పే పందేరపు బండ్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పందేరపు బండ్లను గుడి చుట్టూ తిప్పుతూ తమ పొలాల్లో పండిన ధాన్యాలను భక్తులకు పంచిపెట్టారు.
- తొండపాడులో రథోత్సవం సందర్భంగా గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్, ఆశాబేగం ఆధ్వర్యంలో దాదాపు 250 మంది కానిస్టేబుళ్లతో గట్టి బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తాం



మునీర్ అహమ్మద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని, అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తామని ఆత్మకూరు నూతన ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ అన్నారు. అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన్ను పోలీసు ఉన్నతాధికారులు ఇటీవలే ఆత్మకూరుకు బదిలీ చేశారు. దీంతో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించగా, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకూరు వైస్ సర్పంచ్ తైదుల శివారెడ్డి, నాగరాజు తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు సింగమనేని వర్ధంతి సభ

అనంతపురం కల్చరల్: ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణ వర్ధంతి సభ ఆదివారం జరగనుందని రచయిత్రి డాక్టర్ ప్రగతి ఓ ప్రకటనలో తెలిపారు. సింగమనేని స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరిగే సభలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

వర్సిటీ విద్యార్థుల పల్లెబాట



చిన్నకుంటలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 వలంటీర్లు పల్లెబాట పట్టారు. చిన్నకుంట గ్రామంలో వారం పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో పాల్గొంటున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనూరాధ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఇంటింటా సర్వే,వైద్య శిబిరంతో పాటు గ్రామంలో పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం



రథంపై విహరిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక గ్రామంలో కొండల్లో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం , సహస్రనామార్చన వంటి కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు రామాచార్యులు నిర్వహించారు. స్వామివారికి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రమణ్యేశ్వర స్వామి వెండి విగ్రహాలను రంగు రంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన రథంలో ఉంచి గ్రామవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు భజన కీర్తనలతో మేళతాళాలతో స్వామి సన్నిధికి చేర్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి రథోత్సవాన్ని తిలకించారు.

'యాజమాన్యమే బాధ్యత వహించాలి'

అనంతపురం ఎడ్యుకేషన్: ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి ఆంధ్రజ్యోతి యాజమాన్యమే బాధ్యత వహించాలని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ డిమాండ్ చేశారు. శనివారం బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. నిజాన్ని నిష్పక్షపాతంగా రాసేది, చూపించేదే నిజమైన జర్నలిజం అన్నారు. తమ ప్రోగ్రాములకు 'పచ్చ మీడియా' రావాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ గతంలోనే ప్రకటించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ పచ్చ మీడియా ప్రతినిధులు మారువేషాలతో రాప్తాడు సిద్ధం సభలోకి ప్రవేశించారన్నారు. తెలివైన సామాజిక వర్గం వారు తప్పించుకుని, బెస్త కృష్ణను మాత్రం బలి పశువును చేశారన్నారు. సిద్ధం సభకు అనుమతి లేకున్నా ఫొటోగ్రాఫర్ కృష్ణను పంపించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యాజమాన్యం, రాధాకృష్ణ ప్రథమ ముద్దాయి అన్నారు. రాధాకృష్ణపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

- ఎంతమంది జతకట్టినా మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం రాజీవ్‌కాలనీ పంచాయతీలో నిర్వహించిన ఇంటింటికి వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలనడిగి తెలుసుకోవడంతో పాటు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అలాంటి పరిస్థితి లేదన్నారు. అర్హత ఉంటే చాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నవరత్నాల పథకాలను ప్రతి ఇంటికీ చేర్చి పేదల అభ్యున్నతికి పాటుపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమ కోసం పాటుపడుతుంటే చంద్రబాబు ఓర్చుకోలేకపోతున్నాడని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఎంతమంది జతకట్టి వచ్చినా తమ పార్టీ విజయాన్ని ఆపలేరన్నారు.పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. అబద్ధపు హామీలు, మాయ మాటలు చెప్పే టీడీపీ, జనసేన నాయకులకు బుద్ధి చెప్పే సమయం దగ్గర పడిందన్నారు.

రాజీవ్‌కాలనీ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేశాం :

2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి రాజీవ్‌కాలనీ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అనంత తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు రామయ్య కాలనీలో నివాసం ఉన్న వారందరికి ఇంటి పట్టాలు అందించి అండగా నిలిచామన్నారు. పంచాయతీ పరిధిలోని ప్రతి కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతీ సాహితీ, సర్పంచ్ ఆశాబీ, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ సంధ్య, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ క్లస్టర్ ఇనాచార్జ్ హుస్సేన్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌గౌడ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అంజి, రహీమ్, దౌలా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదిమూర్తినగర్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 18వ డివిజన్ ఆదిమూర్తినగర్‌లో ఆదివారం ఉదయం 7.30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదిమూర్తినగర్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ నుంచి కార్యక్రమం మొదలవుతుందని, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

షబ్బే బరాత్‌కు మసీదుల ముస్తాబు

అనంతపురం కల్చరల్: ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకునే షబ్బే బరాత్ పర్వదిన వేడుకలకు నగరంలోని రెండోరోడ్డు, పాతూరు, గాంధీబజార్ తదితర మసీదులు ముస్తాబయ్యాయి. ఆదివారం వాడవాడలా సామూహిక ప్రార్థనలు జరగనున్నాయి. నగరంలోని హౌసింగ్ బోర్డు సమీపాన గల ఖబరస్తాన్‌లో నిర్వహించనున్న సామూహిక ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లను శనివారం సాయంత్రం మేయర్ వసీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్ తదితరులు పరిశీలించారు. వేల సంఖ్యలో తరలివచ్చే ముస్లింలకు ఎటువంటి ఇబ్బందీ రాకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. హెచ్చెల్సీ కాలనీలోని ముస్లిం శ్మశాన వాటికలోనూ పనులు పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అబూ సాలెహ, ఇసాక్, రహంతుల్లా, బాబా ఫక్రుద్దీన్, కో ఆప్షన్ మెంబర్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

అల్లా మార్గం అనుసరణీయం

అనంతపురం కల్చరల్: అల్లా మార్గం అనుసరణీయమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మౌలానా సగీర్ అహమ్మద్ అన్నారు. నగర శివారులోని మదర్సా ఏ దారుల్ ఉలూమ్ అరబియాలో ఖురాన్ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం రాత్రి సన్మానం చేశారు. నగర మేయర్ వసీం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా బెంగళూరు నుంచి విచ్చేసిన మౌలానా శాంతి సందేశం వినిపించారు. ఇస్లాం శాంతిని బోధిస్తుందన్నారు. ప్రపంచం సుభిక్షంగా ఉండడానికి అందరూ దువా చేయాలని సూచించారు.

'ముస్లింలకు మొండిచేయి చూపడం అన్యాయం'

అనంతపురం కల్చరల్: టీడీపీ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో ముస్లింలకు మొండి చెయ్యి చూపించడం అన్యాయమని ఐఎంఎం ఆర్గనైషన్ వ్యవస్థాపకుడు మహబూబ్ బాషా అన్నారు. శనివారం ఆయనతో పాటు పలువురు ముస్లిం పెద్దలు ఆ సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మొదటి నుంచి మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు. మరోసారి దాన్నే నిరూపించిందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన ముస్లింలకు న్యాయం చేయాలని కోరినా ఆ పార్టీ అధిష్టానం విస్మరించడం తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ఎన్నికల నిఘా వేదిక కార్యవర్గాల ఎంపిక

అనంతపురం కల్చరల్: ఎన్నికల నిఘావేదిక అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నూతన కార్యవర్గాలను శనివారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా అధ్యక్షునిగా శ్రీనాథ్, సత్యసాయి జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ భాస్కర్ ఎంపికయ్యారు. వీరితో పాటు నూతనంగా ఎంపికైన 35 మంది కార్యవర్గ సభ్యులతో రీజనల్ కో ఆర్డినేటర్ కంబదూరు షేక్ నబీరసూల్ ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లను చైతన్యం చేయడం, ఎన్నికల సంఘం సూచనలను పాటించేలా అందరికీ సహకారం అందించడానికి ఎన్నికల నిఘా వేదిక పనిచేస్తుందని నబీరసూల్ తెలిపారు.

భాగవత శ్రవణంతో ఉత్తమ సంస్కారం



ప్రవచనం చేస్తున్న మాధవ తీర్థులు

అనంతపురం కల్చరల్: శ్రీమద్ భాగవత శ్రవణంతో ఉత్తమ సంస్కారం అలవడుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీవిద్యాసింధు మాధవ తీర్థులు అన్నారు. మొదటిరోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఈ నెల 28 వరకు కొనసాగే భాగవత ప్రవచన కార్యక్రమం శనివారం రాత్రి ప్రారంభమైంది. ఉదయం మంగళమహోత్సవం పేరిట రాఘవేంద్రుల బృందావనానికి ప్రత్యేక అలంకార సేవలు చేశారు.

నగరం రూపురేఖలు మార్చేశాం



రహదారి పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగరం రూపురేఖలు మార్చేశామని మేయర్ వసీం అన్నారు. శనివారం నగరంలోని 47, 48 డివిజన్ల పరిధిలోని సోమనాథ్ నగర్ ప్రధాన రహదారిలో ప్రత్యేక గ్రాంట్ రూ.1.26 కోట్లతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలసి మేయర్ వసీం పరిశీలించారు. కోవిడ్‌తో రెండేళ్లు గడిచిపోయినా..కేవలం రెండున్నరేళ్లలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నగరంలో రూ.800 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు వర్గ విభేదాలతో నగరాభివృద్ధిని విస్మరించారని విమర్శించారు.

భక్తిశ్రద్ధలతో మాఘమాస పూజలు



అశోక్‌నగర్‌లో వ్రతంలో పాల్గొన్న భక్తులు



మంజునాథ ఆలయంలో ఐశ్వర్యేశ్వర వ్రతం



మొదటిరోడ్డులో సామూహిక వ్రతాలు జరిపిస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్: మాఘ శుద్ధ పౌర్ణిమ రాకతో భక్తిభావం ఉట్టిపడింది. శనివారం నగరంలో పలు చోట్ల సత్యనారాయణ వ్రతాలు, గాయత్రి హోమాలు జరిగాయి. స్థానిక అశోక్‌నగర్, మూడవ రోడ్డు షిరిడీ సాయి మందిరం, జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న గణపతి సచ్చిదానంద ఆశ్రమం, తదితర చోట్ల సామూహిక సత్యదేవుని వ్రతాలు ఘనంగా జరిగాయి. వందలాది మంది భక్తులు వ్రతమాచరించారు. మధ్యాహ్నం తీర్థప్రసాద వితరణ, నారాయణ సేవ జరిగాయి.

- హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ, అన్నపూర్ణేశ్వరి ఆలయంలో ఐశ్వర్యేశ్వర వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు బసవరాజ స్వామి నేతృత్వంలో భక్తులు నియమనిష్టలతో వ్రతమాచరించారు. ఆలయంలో కొలువైన మహాశివునికి ఏకవార రుద్రాభిషేకం, భస్మపూజలు చేశారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. విద్యార్థి మృతి



అభినవ కుమార్ మృతదేహం

అనంతపురం: నగరంలోని రుద్రంపేట సర్కిల్‌కు సమీపాన యోగానంది మోటార్స్ ఎదురుగా శనివారం రాత్రి 11.45 గంటల ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో అభినవ కుమార్ (16) అనే విద్యార్థి మృతిచెందాడు. నవాజ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు..అభినవ కుమార్ ప్రస్తుతం పదోతరగతి చదువుతున్నాడు. ఇతని తండ్రి రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తండ్రిని శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై అనంతపురం రైల్వేస్టేషన్‌లో వదిలిపెట్టి.. రుద్రంపేట బైపాస్‌కు సమీపంలోని ఇంటికి తిరుగు పయనమయ్యాడు. మార్గమధ్యంలోని యోగానంది మోటార్స్ వద్ద ఎదురుగా స్కూటీ ఢీకొట్టింది. కిందపడిన అభినవ కుమార్ తలకు తీవ్ర గాయమై.. రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్కూటీపై వస్తున్న నవాజ్ తీవ్రంగా గాయపడగా..స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.కాగా..ఇంటి నుంచి వెళ్లిన అభినవ కుమార్ ఎంతసేపటికీ తిరిగి రాకపోవడం, సెల్‌ఫోన్‌కు కాల్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి ఆ మార్గం గుండా వెతికారు. మార్గమధ్యంలో నిర్జీవంగా పడివున్న అభినవ కుమార్‌ను చూసి గుండెలవిసేలా రోదించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ఆత్మకూరు: ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ హేమలత వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఆమె తహసీల్దార్ పరమేశ్వర స్వామి, ఎంపీడీఓ దశరథరామయ్య, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి తదితరులతో కలిసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. నిల్వ చేసిన మందులను, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణ అంతా దుర్వాసన వెదజల్లుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ... ఇటీవలి కాలంలో ఆస్పత్రిలో సిబ్బంది సరిగా ఉండటం లేదని ఫిర్యాదు అందుతున్నాయన్నారు. ఇక నుంచి వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు సబిహా సుల్తానా, గాయత్రి, వైద్య సిబ్బంది శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలపై కొరడా



ఆర్టీసీ బస్టాండులోని షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం: ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారుల ఆట కట్టించేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు శనివారం అనంతపురం ఆర్టీసీ బస్టాండులోని షాపుల్లో తనిఖీలు చేశారు. ఎంఆర్‌పీ కన్నా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్న ఆరుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌గౌస్, అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.









పల్లకీపై ఊరేగుతున్న కొండమీదరాయుడు, స్వామివార్లకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు



తిరునాలలో భక్తుల సందడి, స్వామికి సమర్పించేందుకు గుమ్మడికాయ తీసుకెళ్తున్న భక్తుడు

- చూసిన

కనులదే భాగ్యము

ఇసుకేస్తే రాలనంత జనం తరలి వచ్చారు. గోవింద నామస్మరణతో మార్మోగించారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిని కనులారా దర్శించుకుని పులకించిపోయారు.

బుక్కరాయసముద్రంలో శనివారం కొండమీదరాయుడి రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులతో వీధులు కిటకిటలాడాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



స్వామివారికి నమస్కరిస్తున్న భక్తురాలు



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు





కొండపైకి వెళ్తున్న భక్తజనం, ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న దృశ్యం

వృత్తికి న్యాయం చేయాలి

- గ్రేడ్ –1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు



హెడ్ నర్సులుగా పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న సూపరింటెండెంట్ మంజు

అనంతపురం మెడికల్: నర్సింగ్ వృత్తికి న్యాయం చేసేలా విధుల్లో ముందుకు సాగాలని హెడ్‌నర్సులకు గ్రేడ్ 1 సూపరింటెండెంట్ మంజు సూచించారు. ఇటీవల ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే ఎం సుశీలదేవి, జీ విజయలక్ష్మి, ఎం ధనలక్ష్మి, మేరి అన్నేపీటర్(కర్నూలు), కే లలిత, వీ శ్రీదేవి, కే గీతాలక్ష్మి(అనంతపురం)కి హెడ్‌నర్సులుగా పదోన్నతి లభించింది. శనివారం సర్వజనాస్పత్రిలో హెడ్‌నర్సులుగా పదోన్నతి పొందిన అనంతపురం స్టాఫ్‌నర్సులకు గ్రేడ్ -1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు హెడ్ నర్సు రెడ్ క్యాప్‌లను అందించారు. ఆమె మాట్లాడుతూ పదోన్నతితో సేవల పట్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో స్టాఫ్‌నర్సులు అందించిన సేవలను కొనియాడారు. ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించడం కారణంగానే ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డులను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో ముమ్మందు అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజని పాల్గొన్నారు.

ఆ గ్రామాలకు నీటి ఎద్దడి రానీయొద్దు



రికార్డులు పరిశీలిస్తున్న సీఈఓ నిధియాదేవి

అనంతపురం సిటీ: తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి మండలాల్లోని 250 గ్రామాలకు తాగునీటి ఎద్దడి రానీయొద్దని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి(సీఈఓ) వైఖోమ్ నిదియాదేవి ఆదేశించారు. తాడిపత్రి సమీపంలోని బాలప్పకోన వద్ద గల జేసీ నాగిరెడ్డి (జేసీఎన్‌ఆర్) తాగునీటి పథక విభాగాన్ని శనివారం రాత్రి 11 గంటలకు పరిశీలించారు. గండికోట రిజర్వాయర్ నుంచి జేసీఎన్‌ఆర్ సమగ్ర మంచినీటి పథకం ద్వారా పైన పేర్కొన్న మూడు మండలాల్లోని గ్రామాలకు తాగునీటిని అందించే ఈ పథకం అమలులో అవాంతరాలు, అంతరాయాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ తాడిపత్రి సబ్ డివిజన్ డీఈ శ్రీరాములును ఆదేశించారు. పుట్లూరు, యల్లనూరు మండలాలకూ తాగునీటిని సరఫరా చేసే పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఆదుకోవాలని సూచించారు.





సన్నాఫ్ విరాట్ కోహ్లీ

అనుష్క శర్మ ఈ నెల 15న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అబ్బాయికి 'అకాయ్' అని పేరు పెట్టినట్లు తెలియజేశాడు విరాట్ కోహ్లీ. అయితే 'అకాయ్' ఫొటోను ఎక్కడా షేర్ చేయలేదు. దీంతో 'అకాయ్' రూపాన్ని రకరకాలుగా ఊహించుకుంటూ అభిమానులు ఏఐ జెనరేటెడ్ ఫొటోలను క్రియేట్ చేశారు. అకాయ్‌ను విరాట్ ఎత్తుకున్నట్లు, విరాట్–అనుష్కలు అకాయ్‌తో ఆడుకుంటున్నట్లు... ఇలా రకరకాలుగా క్రియేట్ చేశారు.

'అకాయ్ ఫొటో షేర్ చేయకుండా విరాట్ కోహ్లీ మంచి పని చేశాడు. చేసి ఉంటే ఇంత అద్భుతమైన చిత్రాలను చూసి ఉండేవాళ్లం కాదు' అంటూ నెటిజనులు ప్రశంసల జల్లు కురిపించారు.

ప్రశంసల వర్షం ఒక కోణం అయితే... సాంకేతిక ఆసక్తి మరో కోణం. 'మీరు ఉపయోగించిన ఏఐ టూల్స్ గురించి వివరంగా తెలుసుకోవాలని ఉంది' అంటూ చాలామంది కామెంట్స్ పెడుతున్నారు.

వైరల్

కరచరణో రసి మణిగణ భూషణ... లుక్... ఐ వాజ్ గోనా గో

శాస్త్రీయ నృత్య వేషధారణ అనగానే శాస్త్రీయ నృత్యమే కళ్ల ముందు కదలాడుతుంది. అలా కాకుండా ర్యాప్ వినిపిస్తే ఎలా ఉంటుంది అని చెప్పడానికి ఈ వీడియో ఉదాహరణ. నటి అదా శర్మ క్లాసికల్ డ్యాన్సర్ వేషంలో అమెరికన్ ర్యాపర్ ఎమెనెమ్ ఐకానిక్ ర్యాప్ 'ర్యాప్ గాడ్' ట్రాక్‌తో 'వావ్' అనిపించింది.





ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ రీల్ వైరల్‌గా మారింది. శర్మను ప్రశంసలతో ముంచెత్తిన వారిలో హీరో అయుష్మాన్ ఖురాన, నటి ఊర్వశీ రౌటేల, ఇండియన్ ర్యాపర్ రఫ్తార్‌లాంటి సెలబ్రిటీ కూడా ఉన్నారు.

యూట్యూబ్ ద్వారా 2013లో విడుదలైన 'ర్యాప్ గాడ్' సాంగ్ సూపర్ హిట్ కావడమే కాదు 'మోస్ట్ వర్డ్స్' విశేషంతో 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్'లోకి ఎంటర్ అయింది. ఎన్నో అవార్డులు గెలుచుకుంది.

'లుక్, ఐ వాజ్ గోనా గో ఈజీ ఆన్ యూ నాట్ టు హర్ట్ యువర్ ఫీలింగ్స్
బట్ ఐయామ్ వోన్లీ గోయింగ్ టు గెట్ దిస్ వన్ చాన్స్
సమ్‌థింగ్ రాంగ్. ఐ కెన్ ఫీల్ ఇట్' అని శాస్త్రీయ నృత్య వేషధారణతో కనిపిస్తున్న అదా శర్మ పాడుతుంటే 'వాహ్వా' అనకుండా ఉండలేము.

చదువుకో తమ్ముడా... చదువుకో చదువుకుంటే కలలు పండే కాలమే నీదవుతది

ఢిల్లీలోని కమలానగర్ మార్కెట్‌కు దగ్గరలో ఉన్న ఫుట్‌పాత్‌పై కూర్చున్న ఒక పిల్లాడు శ్రద్ధగా చదువుకుంటూనే మరో వైపు హెయిర్ బ్యాండ్‌లను అమ్ముతున్నాడు. ఇది చూసిన హ్యారీ అనే ఫొటోగ్రాఫర్ పిల్లాడితో మాటలు కలిపాడు.

ఆరో క్లాసు చదువుతున్న పవన్ తన కుటుంబానికి సహాయంగా ఉండడం కోసం ఫుట్‌పాత్‌పై హెయిర్ బ్యాండ్‌లు అమ్ముతుంటాడు. అలా అని చదువును ఎక్కడా నిర్లక్ష్యం చేయడు. ఏ రోజు పాఠాలు ఆ రోజు శ్రద్ధగా చదువుకుంటాడు. తన కుటుంబ స్థితిగతులను హ్యారీకి చెప్పాడు పవన్.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో తక్కువ టైమ్‌లోనే పది మిలియన్‌లకు పైగా వ్యూస్‌తో దూసుకుపోయింది. పవన్ కుటుంబానికి అండగా నిలబడడానికి చాలా మంది ముందుకు రావడం మరో విశేషం.

మంటతో హెయిర్ కట్ చేస్తాడు... మండిపడకండి సార్!

'జుట్టున్నమ్మ ఏ కొప్పు వేసినా అందమే' అన్నారు గానీ 'టాలెంట్ ఉన్న వ్యక్తి కత్తెర ఉపయోగించకుండా హెయిర్ కట్ చేసినా జుట్టుకు అందమే' అని ఎవరూ అనలేదు. విషయంలోకి వస్తే... తమిళనాడులో ఒక బార్బర్ తన కస్టమర్‌కు హెయిర్ కటింగ్ చేయడానికి కత్తెర ముట్టుకోకుండా 'మంట'ను ఉపయోగించాడు. క్లయింట్



జుట్టు కత్తిరించడానికి, స్టైల్ చేయడానికి 'ఫైర్ టార్చ్'ను ఉపయోగించి రకరకాల విన్యాసాలు చేశాడు. 'ఎక్స్'లో ప్రత్యక్షమైన ఈ వీడియో క్లిప్ ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

ఇక ఈ వీడియోకు వచ్చిన స్పందన విషయానికి వస్తే... బార్బర్ నైపుణ్యం, ధైర్యాన్ని చాలామంది అభినందించగా కొద్దిమంది మాత్రం 'నీ దుంపతెగ ఇదేమీ దుస్సాహసం' అన్నట్లుగా కామెంట్లు పెట్టారు. 'నెత్తి మీద ఇంత దగ్గరగా మంటను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలు...' అంటూ చెప్పుకొచ్చారు కొందరు.

క్లయింట్‌కు ఎర్ర వస్త్రం చుట్టి మరీ ప్రయోగంలోకి దిగాడు బార్బర్. రెడ్ క్లాత్ చుట్టడం అనేది యాదృచ్ఛికంగా జరిగిందా లేక 'ఇది ప్రమాదం సుమీ' అని చెప్పకనే చెప్పాలనుకున్నాడో తెలియదు.

కశ్మీర్‌కు చెందిన పారా క్రికెటర్ అమిర్ హుసేన్ జీవితం వెలిగింది. రెండు చేతులూ లేకపోయినా మెడతో బ్యాట్ పట్టి ఆడే అమిర్ తనను ఇన్‌స్పైర్ చేసిన క్రికెట్ దేవుడు సచిన్‌ని జీవితంలో కలుస్తాననుకోలేదు. కలిశాడు. అంతేనా? సచిన్ నుంచి ఊహించని బహుమతి అందుకున్నాడు. ఈ వివరం ఏమిటంటే...

క్రికెట్ దేవుడే దిగి వస్తే...




సచిన్ టెండూల్కర్ తన భార్య అంజలి, కుమార్తె సారాతో కశ్మీర్ పర్యటనలో ఉన్నాడు. ఇది అతని తొలి కశ్మీర్ పర్యటన అని భోగట్టా. అక్కడి 'చార్సో' అనే ఊళ్లో ఉండే బ్యాట్ల తయారీ కేంద్రాన్ని సచిన్ సందర్శించాడు. అంతే కాదు... అక్కడి 'బిజిబెహరా' ప్రాంతానికి చెందిన పారా క్రికెటర్ అమిర్ హుసేన్‌ను తన హోటల్‌కు పిలిపించుకుని ప్రత్యేకంగా కలిశాడు. అమిర్ హుసేన్ ప్రస్తుతం కశ్మీర్ పారా క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా ఉన్నాడు. పుట్టుకతో చేతులు లేని అమిర్ తన జీవితంలో పేర్కొన్న నిరాశను సచిన్‌ను చూసి ఇన్‌స్పైర్ అయి క్రికెటర్ కావడంతో పోగొట్టుకున్నాడు. బ్యాట్‌ను మెడ, భుజాల మధ్య పట్టి అతను క్రికెట్ ఆడతాడు. ఈ స్ఫూర్తిమంతమైన గాథను విన్న సచిన్ తన పర్యటన సందర్భంగా అమిర్ హుసేన్‌ను కలిశాడు. 'నిన్ను కలవడం సంతోషం' అని 'ఎక్స్'లో తానే పోస్ట్ పెట్టాడు. సచిన్‌ని చూడగానే ఇలాంటిది తన జీవితంలో జరిగిందా అన్నట్టుగా భావోద్వేగంతో కదిలిపోయాడు అమిర్. 'ఇలాగే నువ్వు మమ్మల్ని ఇన్‌స్పైర్ చేయి' అని అమిర్‌తో సచిన్ చెప్పాడు. అంతేనా? తను సంతకం చేసిన బ్యాట్ ఇచ్చి అమిర్‌ని తబ్బిబ్బు చేశాడు.

సర్వర్ డ్రోన్ సుందరం



కాఫీ హోటల్ ఏదైనా సర్వర్ గారు సుందరమే అయి ఉంటాడని గతంలో అనుకునేవారు. ఎందుకంటే టిఫిన్ హోటల్స్ తమిళులే నడిపేవారు కాబట్టి. ఇప్పుడు సర్వర్ గారి అడ్రస్ గల్లంతయ్యేలా ఉంది. మనుషులకు జీతాలు ఇవ్వడం కంటే ఒక డ్రోన్‌తో మేనేజ్ చేయొచ్చని కోల్‌కతా రెస్టరెంట్ డిసైడ్ అయ్యింది.

వాన కోసం ఆకాశం వైపు చూడొచ్చుగాని కాఫీ కోసం కూడా చూడొచ్చా? చూడొచ్చు. ఆకాశం నుంచి కాఫీ ఎగిరొచ్చి చేతికి అందుతుంది. ఇది కోల్‌కతా సాల్ట్‌లేక్ సిటీ ఏరియాలోని 'కోల్‌కతా 64' అనే రెస్టరెంట్ వారు తమ కస్టమర్లను ఆకర్షించడానికి వేసిన సాంకేతిక ఎత్తుగడ. ఆకర్షణ. రెస్టరెంట్ లోపల కూచున్న వారికి సర్వర్లు కాఫీ అందించినా బయట తమకు తోచిన చోటులో కూచుని కాఫీని ఆస్వాదించాలంటే డ్రోన్ సుందరం గారే కాఫీని అందిస్తారు. ఈ వీడియో ఇన్‌స్టాలో ప్రత్యక్షం కాగానే 'ఇదేదో బాగానే ఉంది' అని చాలామంది మెచ్చుకుంటున్నారు. అయితే ఈ యంత్రం మనిషిని మాయం చేస్తున్నట్టే. మన దేశంలో మధ్యతరగతి జీవులకు కాఫీ హోటళ్లు, అందులో పని చేసే సర్వర్లు జీవితంలో భాగం. అందుకే సినిమాల్లో, సాహిత్యంలో సర్వర్లు కనపడతారు. కె.బాలచందర్ తీసిన 'సర్వర్ సుందరం'లో నగేష్ నటించి పేరు గడించాడు. 'శుభలేఖ'లో చిరంజీవి కూడా 'వెయిటర్' అనబడు 'సర్వరే'. ఇటీవలి కాలంలో ఆనంద్ దేవరకొండ నటించిన 'మిడిల్‌క్లాస్ మెలొడీస్' టిఫిన్ సెంటర్ నేపథ్యంలో ఓనర్ కమ్ సర్వర్‌గా హీరో చేసే ప్రగుల్‌ను చూపుతుంది. ఏమైనా ఈ డిజిటల్ ఏజ్‌లో 'మాయమవుతున్నాడమ్మ మనిషి' అనుకోక తప్పదు.

హెల్త్

మంచి జనాదరణ పొందిన దంగల్ సినిమాలో నటించిన సుహానీ భట్నాగర్ అనే నటి ఇటీవల తన 19వ ఏట చాలా చిన్నవయసులోనే డర్మటోమయోసైటిస్ అనే వ్యాధితో చనిపోవడంతో... ఈ జబ్బు పేరు పలువురి నోట వినిపించింది. గతంలో అరుదైనదిగానే పేరున్న ఈ ఆరోగ్య సమస్య.. ఇటీవల కాస్త తరచుగా కనిపిస్తుండటం ఆందోళన గొలిపే అంశం. చాలా తీవ్రమైనదిగా పరిగణించే ఈ సమస్యకు పూర్తిగా నయం చేసే చికిత్స లేకపోయినా దీని లక్షణాలను అదుపులో ఉంచడానికి అవసరమైన చికిత్స తీసుకోకపోతే... ఒక్కోసారి ప్రమాదకరంగా పరిణమించే అవకాశమున్న ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.



ఇటీవల డర్మటో మయోసైటిస్‌తో మృతి చెందిన దంగల్ ఫేమ్ సుహానీ భట్నాగర్

డర్మటో-మయోసైటిస్ అంటే?

డర్మటో మయోసైటిస్ అనే ఈ వ్యాధిలో ప్రధానంగా కండరాలు బలహీనమై, చర్మమూ ప్రభావితమవుతుంది. ఆహారాన్ని మింగలేపోవడం, శ్వాస తీసుకోలేకపోవడం, ఊపిరితిత్తులు పీచులా మారిపోయే 'ఇంటస్టిషియల్ లంగ్ డిసీజ్'కి దారితీయడం వంటి అనేక సమస్యలు ఇందులో కనిపిస్తాయి. కండరాలూ, చర్మంతో పాటు పలు కీలకమైన అవయవాలూ, వ్యవస్థలను దెబ్బతీస్తున్నందున దీన్ని కొన్ని వ్యాధుల సమాహారంలా పరిగణించే 'పాలీమయోసైటిస్' వ్యాధుల్లోనిదిగా పేర్కొంటారు. ఇందులోని మిగతా మయోసైటిస్ వ్యాధులు కాస్త మెల్లగా తమ ప్రభావాన్నీ, లక్షణాలను చూపించినప్పటికీ... 'డర్మటో–మయోసైటిస్' లక్షణాలూ చాలా వేగంగా అభివృద్ధి చెందుతూ వ్యక్తమవుతాయి. తగిన చికిత్స అందకపోతే అవి మరింత తీవ్రతరమవుతాయి.

లక్షణాలు...

ఈ వ్యాధిలో కండరాలు చాలా బలహీనంగా అనిపించడంతో పాటు ఒంటి మీద ర్యాష్ రావడం ఒక ప్రధాన లక్షణం. కొందరిలో నీరసమూ... ర్యాష్ ఒకేసారి కనిపిస్తాయి. మరికొందరిలో ఇవి వేర్వేరు సమయాలలో కనిపించవచ్చు. అంటే వారాలూ, నెలలు ఒక్కోసారి ఏళ్ల తర్వాత కూడా వ్యక్తం కావచ్చు. కండరాల బలహీనత ఎంత ఎక్కువగా ఉంటుందంటే... ● నిటారుగా కూర్చోలేకపోవడం. ● కూర్చున్నవారు కనీసం కుర్చీ / సోఫా నుంచి లేవలేకపోవడం. ● మెట్లు ఎక్కలేకపోవడం ● పక్కకు ఒరిగిన వాళ్లు మళ్లీ పైకిలేవలేకపోవడం... ● ఇదే బలహీనత, నిస్సత్తువ గుండె, ఊపిరితిత్తులకూ ఆవరించడంతో శ్వాసతీసుకోవడం కష్టం కావడం, దగ్గు వంటి లక్షణాలూ కనిపిస్తాయి.
● బలహీనతతో పాటు జ్వరం, బరువు తగ్గడం, కండరాల, కీళ్ల నొప్పులు, ఒంటి మీద ర్యాష్.

నిర్ధారణ పరీక్షలు...

● కొన్ని రకాల రక్తపరీక్షలతో డర్మటో–మయోసైటిస్‌ను నిర్ధారణ చేస్తారు. కండరాలు దెబ్బతిన్నాయని సూచించే కొన్ని రకాల మజిల్ ఎంజైమ్‌ల రక్తపరీక్షలతో పాటు, ఆటో యాంటీబాడీస్ (వ్యాధి నిరోధక వ్యవస్థను దెబ్బతీసే సొంత ఇమ్యూన్ కణాల)ను కనుగొనే రక్తపరీక్షలతో దీన్ని నిర్ధారణ చేస్తారు.
● ప్రభావితమైన చర్మం నుంచి ముక్క సేకరించి చేసే 'స్కిన్ బయాప్సీ' కూడా చేస్తారు. దీనివల్ల దేహంలోని ఇన్‌ఫ్లమేషన్‌తో కండరాలు దెబ్బతిన్నాయా లేదా అని పరిశీలించే అవకాశం దొరుకుతుంది. ● కొన్ని సందర్భాల్లో ఎమ్మారై, ఛాతీ ఎక్స్–రే పరీక్షలూ నిర్ధారణకు ఉపకరిస్తాయి. ● అవసరాన్ని బట్టి ఎలక్ట్రో మయోగ్రఫీ (ఈఎమ్‌జీ) అనే పరీక్షతో కండరాలు–నరాల స్పందన ఎలా ఉందో కూడా తెలుసుకోవాల్సి రావచ్చు.

కారణాలు...

ఈ వ్యాధి ఎందుకు వస్తుందనే అంశంపై నిర్దిష్టమైన కారణాలు ఇంకా స్పష్టంగా తెలియవు. జన్యుపరమైన సమస్యలోనూ, వాతావరణం కాలుష్యం, సూర్యుడి తీక్షణమైన కాంతిలో ఎక్కువసేపు గడపడం వల్ల వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. పర్యావరణ సమస్యలతో పాటు పొగతాగడం, కొన్ని రకాల ఔషధ దుష్ప్రభావాలూ ఇందుకు కారణం కావచ్చని అంచనా. కొన్ని రకాల వైరల్ సమస్యలతో బాధపడ్డవారిలోనూ డర్మటో–మయోసైటిస్ కనిపించడం చాలా సందర్భాల్లో కనిపించింది.

మేనేజ్‌మెంట్ - చికిత్స...

సొంత వ్యాధినిరోధక వ్యవస్థ దేహానికి ప్రతికూలంగా మారే ఆటో ఇమ్యూన్ డిసీజ్ కావడం వల్ల ఈ వ్యాధిని పూర్తిగా నయం చేసే అవకాశం లేదు. అయితే లక్షణాలను అదుపు చేస్తూ, వ్యాధి మరింత పెరగకుండా నియంత్రించే మేనేజ్‌మెంట్ పద్ధతులతో డర్మటో–మయోసైటిస్‌పై అదుపు సాధించాలి. ఇందుకు కార్టికో స్టెరాయిడ్స్‌తో పాటు ఫిజియోథెరపీ లాంటి ఫిజికల్ పద్ధతులు ఎంతగానో ఉపకరిస్తాయి.
● కార్టికో స్టెరాయిడ్స్ : తీవ్రత ఆధారంగా వీటిని, వీటి మోతాదులను కేవలం డాక్టర్లు మాత్రమే సూచించాలి. వారి పర్యవేక్షణలోనే కార్టికో–స్టెరాయిడ్స్ వాడాల్సి ఉంటుంది. అలాగే టాపికల్ స్టెరాయిడ్స్ అని చెప్పే... పైపూత మందులూ వాడాల్సి రావచ్చు.
● ఫిజియోథెరపీ : బలహీనపడ్డ కండరాల్లో బలమూ, సత్తువ నింపడానికి, దెబ్బతిన్న కండరాల్లో మునుపటి శక్తి సాధించడానికి ఫిజియోథెరపీ బాగా ఉపయోగపడుతుంది. డర్మటో–మయోసైటిస్‌లో ఫిజియోథెరపీ చాలా కీలకం.
● ఇమ్యూనో సప్రెసెంట్ ఔషధాలు : వ్యాధి నిరోధక వ్యవస్థలో తీవ్రంగా మారి దెబ్బతీస్తున్న కణాల తీవ్రతలను అదుపు చేసే మందులైన ఇమ్యూనో సప్రెసెంట్స్‌ను చాలా సునిశితమైన రీతిలో వాడాలి.
● ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ (ఐవీఐజీ) : ఇమ్యూనో సప్రెసెంట్లతో పాటు... మన రక్తంలోని ప్లాస్మాలోనే ఉండే ఈ స్వాభావికమైన పదార్థాలను బయటనుంచి బాధితులకు ఇవ్వడం అనేది మరో ఆధునిక ప్రత్యామ్నాయ చికిత్స ప్రక్రియల్లో ఒకటి.
● స్పీచ్ థెరపీ: అన్ని కండరాల్లాగానే గొంతు కండరాలు బలహీనపడి మాట్లాడటం కష్టమైన వారికి స్పీచ్ థెరపీ ద్వారా మాట్లాడటానికి శిక్షణ ఇవ్వాల్సి రావచ్చు. అలాగే మింగడం కష్టమైన వారికీ ఆ దిశగా సహాయం అవసరం పడవచ్చు. ● వ్యాధి మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఎండల్లో ఎక్కువగా తిరగకపోవడమూ, బాగా ఎండలో తిరగడం తప్పనిసరి అయితే నిపుణుల సలహా మేరకు ఎస్‌పీఎఫ్ 50కి పైన ఉండేవీ, తగిన సన్–స్క్రీన్ లోషన్స్ వాడటం వంటివీ తప్పనిసరి.

ఈ మేనేజ్‌మెంట్ పద్ధతులూ, డాక్టర్ల నిశిత పర్యవేక్షణలో స్టెరాయిడ్స్‌తో పాటు ఇతర మందులూ తీసుకుంటూ ఉన్నట్లయితే తొలుత లక్షణాలు తగ్గి, పరిస్థితులు చాలావరకు నార్మల్ అవుతాయి. ఆ పైన వ్యాధిని అదుపులో ఉంచుకుంటూ దాదాపుగా సాధారణ జీవితాన్ని జీవించే అవకాశాలు కొంతవరకు బాగానే ఉంటాయి. ప్రత్యేకంగా నివారణ అంటూ లేకపోయినా... ఆరోగ్యకరమైన పరిసరాల్లో ఉండటం, పొగతాగడం పూర్తిగా మానేయడం చాలా మంచిది. పైగా ఈ వ్యాధి గొంతును, ఊపిరితిత్తులు, గుండెను ప్రభావితం చేసేదైనందున పొగతాగడం మానేయడం మరింత ఎక్కువ అవసరం.



డాక్టర్ మహమ్మద్ ఇర్ఫాన్,
సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్

● హైపర్‌ట్రైగ్లిజరైడెమియా

ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గించుకోవాల్సిందే!... ఎందుకంటే?



రక్తంలో కొలెస్ట్రాల్ వంటి మరో రకం కొవ్వులే ఈ ట్రైగ్లిజరైడ్స్. రక్తంలో ఈ ట్రైగ్లిజరైడ్స్ మోతాదులు ఉండాల్సిన దానికంటే పెరిగే కండిషన్ 'హైపర్ ట్రైగ్లిజరైడెమియా' అంటారు. ఇది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉన్నందున 'హైపర్ ట్రైగ్లిజరైడెమియా' ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, అవసరమైతే మందులు వాడుతూ, వాటిని నియంత్రణలో ఉంచుకోవడం అవసరం.

ట్రైగ్లిజరైడ్స్ అనేవి ఆహారంలో కొవ్వులు ఎక్కువగా తీసుకోవడంతో పాటు... కాలేయంలోంచి కూడా ఉత్పత్తి అవుతాయి. వీటి మోతాదులు పెరగడం ప్రధానంగా గుండెజబ్బుల ముప్పు తెచ్చిపెట్టవచ్చు. అందుకే రక్తపరీక్షల్లో ట్రైగ్లిజరైడ్స్ కొవ్వులు ఎక్కువగా ఉన్నట్లు తేలితే వాటిని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.

ముప్పును పెంచే అంశాలివి...

డయాబెటిస్, ప్యాంక్రియాటైటిస్, కిడ్నీ జబ్బులు, హైపోథైరాయిడిజమ్ వంటి సమస్యలు ఉన్నవారిలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉండటం మరింత ముప్పు తెచ్చిపెట్టే అంశంగా మారుతుంది.

లక్షణాలు...

● జీర్ణవ్యవస్థకు సంబంధించి: వికారం, కొన్నిసార్లు వాంతులు, కొన్ని సందర్భాల్లో కడుపు మధ్యభాగంలో నొప్పి.
● శ్వాస వ్యవస్థలో : అతి కష్టమ్మీద శ్వాస తీసుకోవడం.
● చర్మం మీద : పసుపుపచ్చ రంగులో ఉబ్బెత్తుగా కొవ్వు పేరుకున్నట్లుగా కనిపించే ప్యాచ్‌లు (గ్జాంథోమాస్). ఈ ప్యాచ్‌లు ఛాతీ, వీపు, పిరుదుల మీద కనిపించవచ్చు.
● కళ్ల దగ్గర: కనురెప్పల చివర్లలో, కంటికింద ఉబ్బెత్తుగా కనిపించే సంచుల్లాంటివి.
● నరాలకు సంబంధించి: గుండెకు ముప్పు తెచ్చే ఈ ట్రైగ్లిజరైడ్స్ కొన్నిసార్లు మతిమరపు, డిప్రెషన్‌లకూ దారితీయవచ్చు.

నిర్ధారణ.. సాధారణ రక్తపరీక్షలో కొవ్వుల మోతాదు తెలుసుకునే లిపిడ్ ఎనాలసిస్. అవసరాన్ని బట్టి ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, టీఎస్‌హెచ్ అనే థైరాయిడ్ పరీక్ష, మూత్రపరీక్ష, కాలేయ పరీక్షలూ నిర్వహిస్తారు.

ట్రైగ్లిజరైడ్స్ తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉన్నప్పుడు కొన్ని ఆహార నియమాలు పాటించడం ద్వారా వాటిని తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు జీవనశైలిలో మార్పులు తప్పనిసరి. ● బరువు తగ్గాలి. ఇందుకు ఆహారంలో మార్పులు చేసుకోవాలి. ● పొట్టుతీయని ధాన్యాలు (అంటే... దంపుడు బియ్యం, పొట్టుతీయని రాగులు, గోధుమలు), పొట్టుతీయని పప్పుధాన్యాలు, మొలకెత్తిన గింజలు తీసుకోవాలి. ● కొవ్వులు (శాచ్యురేటెడ్ ఫ్యాట్, కొలెస్ట్రాల్) తక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. తాజా పండ్లు, డ్రైఫ్రూట్స్‌లో పీచు ఎక్కువగా ఉండటం వల్ల అవి ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గించడంలో బాగా ఉపయోగపడతాయి. ● మాంసాహారం తీసుకోవాలనుకునేవారు వారంలో మూడు సార్లు చేపలు తీసుకోవచ్చు. అది కూడా కేవలం ఉడికించి వండినవీ, గ్రిల్డ్ ఫిష్ మాత్రమే తీసుకోవాలి. డీప్ ఫ్రై చేసినవి తీసుకోవడం సరి కాదు. ● కొవ్వుల మోతాదు ఎక్కువగా ఉండే మాంసాహారం (రొయ్యలు, చికెన్ స్కిన్), వేపుళ్లు, నెయ్యి, నేతితో చేసిన స్వీట్స్, బేకరీ ఐటమ్స్‌కు దూరంగా ఉండాలి. ● స్మోకింగ్, ఆల్కహాల్ పూర్తిగా మానేయాలి. ● రోజూ కనీసం 30 నిమిషాలు శారీరక శ్రమ/వాకింగ్ వంటి వ్యాయామాలు చేయాలి.

మందులు... ట్రైగ్లిజరైడెమియా తీవ్రత ఎక్కువగా ఉన్నవారు డాక్టర్లు సూచించిన మీదట కొన్ని మందులు వాడాల్సి రావచ్చు. దీని తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నవారిలో అరుదుగా కొందరిలో 'ప్లాస్మాఫెరిసిస్' అనే ప్రక్రియ అవసరం పడవచ్చు.



డాక్టర్ ప్రవీణ్ కుమార్ కులకర్ణి,
సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

మెడి టిప్

వెన్ను / నడుము నొప్పా...? బైక్ ఎర్గానమిక్స్ లోపాల వల్ల కావచ్చు!

వెన్ను నొప్పి, నడుము నొప్పి కనిపించడానికి అనేక కారణాలున్నప్పటికీ... కొన్నిసార్లు బైక్ మీద కూర్చునే విధానంలో తేడాల వల్ల కూడా నొప్పి రావచ్చు. అప్పుడు డ్రైవింగ్‌పరంగా తప్పిదాలు ఏమైనా ఉన్నాయేమోనని ఒకసారి పరీక్షించుకుని, సరిదిద్దుకోవాల్సిన అంశాలివి...
● బైక్‌పై కూర్చున్నప్పుడు వీపు నిటారుగా ఉండి, వెన్ను ఒంగిపోకుండా జాగ్రత్త పడాలి. అయితే కొన్ని స్పోర్ట్స్ బైక్‌లలో సీట్లు మరీ ఏటవాలుగా ఉండి, కూర్చొనే భంగిమ కూడా వాలుగా ఉండి, బాగా ముందుకు వాలినట్టుగా కూర్చోవాల్సి వస్తుంది. ఇలా రూపొందించిన ఫ్యాషన్ బైక్స్ వల్ల వెన్ను నిటారుగా లేక వెన్ను / నడుము నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ. ● బైక్‌లపై ప్రయాణం చేసేవారు వీపున బ్యాక్‌ప్యాక్స్ లేదా ల్యాప్‌టాప్ బ్యాగ్స్ పెట్టుకొని వెళ్తుండటం మామూలే. ఈ బ్యాగు బరువు నడుంపైనా భారం పడటం వల్ల కూడా నొప్పి రావచ్చు. అందువల్ల బ్యాగు భారం వీపు మీద పడకుండా, ఆ బరువు సీటు మీద పడేలా, బ్యాగ్ సీట్ మీద ఆనేలా అమర్చుకోవాలి. ● తాము కూడా నిటారుగా, సౌకర్యవంతంగా కూర్చుంటున్నారా లేదా అన్నది చూసుకోవాలి. సిట్టింగ్ పోష్చర్‌లో లోపాలుంటే సరిదిద్దుకోవాలి.

ఈ జాగ్రత్తల తర్వాత కూడా వెన్ను, నడుము నొప్పి వస్తుంటే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించాలి.